# దానఫలితం

## — ఇందిరా రమణ

సాత్యవతేయ మహాముని ఒకరోజు ధర్మరాజుతో ''ధర్మనిధీ! భారత యుద్ధంలో చేసిన జ్ఞాతివధ వల్ల విశేష పాపం కలుగునని నీవు మదనపడుతున్నావుగదా! అశ్వమేధ యాగం చేసిన ఎడల నీ మనసులోని చింత తొలగిపోగలదు. అంతేకాక నీకు ఇక మంగళం కలుగుతుంది'' అన్నాడు.

ఆ ముని ఆదేశానుసారం అతని చేతుల మీదుగానే యాగం మొదలుపెట్టాడు. ఏ లోపమూ రాకుండా నిర్వర్తించాడు. శ్రీకృష్ణుడు, మునులు, దేవతలు, మొదలగు వారంతా ధర్మరాజుని వేనోళ్ళ పొగడిరి.

అతిథులందరూ షడ్రసోపేతంగా భుజించి దరిద్రబాధ తొలగునంత దానాలు స్వీకరించి సంతోషంతో వెడలుచుండిరి.

ధర్మరాజు ఆ యాగం చేస్తున్నంత సేపూ దేవేంద్రుని వైభవం కళ్ళకు కట్టినట్లు కన్పించింది. యాగం చూడడానికి వచ్చిన వారంతా ధర్మరాజుని అభినందించి వెళ్ళిరి.


అట్టి సమయంలో ఒక ముంగిస సమీపమునున్న కలుగు నుండి బయటకు వచ్చి బ్రాహ్మణోత్తముల, మునుల మధ్యకు వచ్చి నిలచి ''మహనీయులారా! నక్తు ప్రస్తుడను బ్రాహ్మణుడు చేసిన యజ్ఞములో ఇది ఎన్నోవంతు? మీరెందుకు వంది మాగధుల వలె అతనిని పొగడుచున్నారు?'' అని పలికింది.

వారు ''మహా మునులచేత, దేవతల చేత ప్రశంసించబడిన యీ యాగంలో నీకు లోపమేమి కనిపించినది'' అని అడిగిరి.

''పూజ్యులారా! ధర్మక్షేత్రమని పేరుపొందిన కురుక్షేత్రంలో నక్తుప్రస్తుడను ఒక బ్రాహ్మణోత్తముడు కలడు. అతడు భార్య, కొడుకు, కోడళ్ళతో సహా ఉంఛ వృత్తితో జీవయాత్ర సాగిస్తున్నాడు. ఆ బ్రాహ్మణుడు ధర్మనిష్ఠకలవాడు. ఆ కుటుంబములోని వారు కూడా అక్షరశః ఆ మహనీయుని ధర్మ నిష్ఠను అనుసరించారు.

ఇట్లా వుండగా ఎడతెగని వర్షాలవల్ల 'నివరి' ధాన్యమంతా కొట్టుకొని పోయింది. క్రమంగా ఆ కుటుంబానికి భోజనం దొరకడం కూడా కష్టమైంది. అయినా వారు ఆందోళన పడక మిక్కిలి ఓరిమితో ఉదయము నుండి సాయంత్రం వరకు 'నివరి' గింజలను ఏరుతూనే ఉన్నారు. సంధ్యాసమయానికి లభించిన ధాన్యంతో కుంచెడు పేలపిండి చేసుకున్నారు. అనుష్ఠానాలన్నీ ముగించుకొని వచ్చి నలుగురూ సమభాగాలు చేసుకొని తినుటకు ప్రారంభించారు.

అంతలో క్షుద్బాధకు తట్టుకోలేక ఒక బ్రాహ్మణుడు వారి ఇంటి ముందు నిలబడి అర్థించాడు. వెంటనే నక్తుప్రస్తుడు వానికి ఎదురుపోయి అతిథి మర్యాదలతో లోనికి



తీసుకొచ్చాడు. తన భాగము పేలపిండి అతనికి సమర్పించి నమస్కరించెను. ఆ పదార్థము తిని అతడు సంతృప్తి చెందలేదు. అయ్యో! బ్రాహ్మణుని అర్థాకలితో పంపవలసి వచ్చింది కదా! అని బాధపడుచుండగా అతని అర్ధాంగి నా ఆహార భాగమును తిని మీరు సంతుష్టులు కావలసిది అని కోరింది. అమ్మా! పశువులూ, పక్షులూ కూడా తమ ఆశ్రితులకు ఆహారాన్ని సమకూర్చుచున్నవి. నీ భర్త నీ ఎడల ప్రేమతో సమకూర్చిన ఆహారాన్ని నేను గ్రద్దలా తన్నుకొని పోవటం భావ్యంగా లేదని పలికాడు. అయినప్పటికి భార్యాభర్తలు ఇరువురూ బ్రాహ్మణుని బలవంతపెట్టి మొత్తం అందరి భాగాలు అతనికి అర్పించి నమస్కరించిరి. మొత్తం తిని ఆ బ్రాహ్మణుడు సంతృప్తితో లేచి ''బ్రాహ్మణోత్తమా! నీ పరివారమంతా నీ ధర్మనిష్ఠను అనుసరిస్తున్నారు. నేను ధర్మదేవతను. నిన్ను పరీక్షించవలెనని వచ్చితిని. ధర్మనిష్ఠలో నీవే గెలిచితివి'' అని పలికెను.

నీ కుటుంబము వారందరకు బ్రహ్మలోకము ప్రాప్తించినది. దేవదుందుభులతో నిన్నాహ్వానించుచున్నారు. నిన్ను చూడవలెనని మహర్షులందరూ ఆరాటపడుచున్నారు. సత్వరమే పత్నీసమేతుడవై కొడుకు, కోడలుతో సహా స్వర్గమునకు బయలుదేరుము'' అని ధర్మదేవత చెప్పాడు. మాణిక్య ఖచిత విమానము అతనివద్ద ఆగినది. ఆ విమానంలో ఎక్కి వారు స్వర్గలోకమునకు పోయిరి.

నేను ఈ వృత్తాంతమంతా సమీపమునున్న కలుగు నుండి చూచాను. పిమ్మట బయటకు వచ్చి పేలపిండి సువాసనకు అటూ ఇటూ తిరిగాను. అతిథికి కాళ్ళు కడిగిన నీటిలో అటూ ఇటూ పొర్లితిని. అందువల్ల నాతల మొత్తం బంగారమైంది. అంతేకాక ఒక పార్శ్వమంతా బంగారమయమైంది. మరొక ప్రక్క కూడా బంగారంగా మారాలని ఎక్కడ యజ్ఞం చేస్తే అక్కడకు పోయి ఆ నీటిలో మునిగి వస్తున్నాను. కాని నా మనోరథం నెరవేరటంలేదు.

''లోకోత్తర చారిత్రుడు యాగం చేస్తున్నాడని గంపెడాశతో వచ్చి ఇక్కడ నీటిలో మునిగాను. ఇక్కడా నాకు నిరాశే ఎదురైనది. ఉంఛవృత్తితో ధర్మనిష్ఠ కలిగిన ఆవిప్రుని ఆతిథ్యం కన్నా ఈ యాగంలో నీ దానాలలో గొప్పదనమేమున్నది?'' అని పలుకుచు కొంచెము దూరము పోయి మాయమైనది.

ఆ ముంగిస ఆవిధంగా పలుకుటకు

కారణమేమి ఆ యాగము యొక్క వివరాలు, ముంగిస జన్మవృత్తాంతం తెలుప వలసినదని రాజు కోరాడు.

అంతట వైశంపాయనుడు రాజా "ఒకప్పుడు అమరాధిపతి గొప్ప క్రతువు ఒకటి సంకల్పించాడు. అనుచరులతో యజ్ఞ పశువులను తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. ఆ పశువులను చూచి మునులు కొందరు పశుహింస పనికి రాదనిరి. వారిలో వారు కొంత సేపు వాదులాడుకొనిరి. చివరకు శచీంద్రుని న్యాయమడిగిరి. శచీపతి కొంతసేపు ఆలోచించి పశుబలిని బలపరిచాడు. దివిజాధిపతి, మునులు ఘర్షణపడిరి. అక్కడ వున్నవారంతా ఎవరి ఏలికల వైపు వారు చేరి వాదులాటను మరింత చేసిరి. ఆ సమయంలో వసువు అక్కడకురాగా తీర్పు చెప్పవలసినదని పశువును కోరిరి. ఆ రాజు పక్షపాత దృష్టితో పశువధ సముచితమని చెప్పాడు. అట్టి సలహావల్ల ఆ రాజునకు అధోలోకము ప్రాప్తించినది. మునులు మాత్రం కొద్దిక్షణాల క్రితం కృతయుగం ఆరభమయిందని కృతయుగధర్మము ప్రకారము జీవహింస చేయరాదని అతిక్రమించిన ఎడల దేశానికి అరిష్టం కలుగుతుందనీ అనుచు వెడలిపోయిరి.

కనుక "ఓరాజా! హింసాత్మక మయిన క్రతువుకన్నా ఉదర పోషణకు సంపాదించుకున్న పేలపిండి అంతా ధర్మం చేసిన నక్తుప్రస్తుని ఆ ముంగిస పొగడినది" ఇక ముంగిస కథ చెపుతాను విను అను చెప్పాడు.

జమదగ్ని మహర్షి ఒకప్పుడు నియమ నిష్ఠలతో పితృకార్యము సంకల్పించి హోమధేనువు పాలను ఒక పవిత్ర కలశంలో పట్టి వుంచాడు. ముని శాంత స్వభావమును పరీక్షించాలని క్రోధాధిపతి తలచి ఆ కలశం పాలతోపాటు భూమిపై దొర్లి పాలన్నీ నేలపాలై పోయేటట్టు చేశాడు. కాని అది ప్రమాదం వల్ల జరిగినట్లు భ్రాంతికలిగించెను. పాలు అట్లా పోటానికి కారణం మహర్షి గ్రహించి శాంతముగా వూరుకొన్నాడు. క్రోధదేవత ఆశ్చర్యపడి తన నిజస్వరూపముతో ముని ముందు నిలచి "మునీంద్రా భృగు వంశీయులంతా ముక్కోపులు అను విషయం లోకమంతా వ్యాపించి యున్నది. కాని నేడు అది అసత్యమని ఋజువైనది. పితృకార్యమునకు ఆటంకము కలుగచేసితిని. నా తప్పిదనమును క్షమించవలసినది. నిన్ను పరీక్ష చేయాలన్న ఆలోచనతో అట్లు చేసితిని" అన్నాడు. అప్పటికి ముని ఆగ్రహించక "క్రోధదేవా! ఇందులో నీ తప్పేమున్నది. నిశ్చింతగా వేగిరం పొమ్ము లేని ఎడల పితృకార్యానికి అంతరాయం కలిగించినందుకు పితృదేవతలు నిన్ను శపింతురు" అన్నాడు.

అంతలోనే పితృదేవతలు "జమదగ్నీ నీవు పితృకర్మ మొదలు పెట్టి ఎంతకూ పూర్తి చేయుటలేదు. ఈ అంతరాయం, నీ వుపేక్ష మేము సహించలేము. నీ అశ్రద్ధకు నీవు ముంగిసవై జన్మించు" అని శపించారు. శాప విమోచనం చెప్పవలసినదని విలపించగా వారు "జమదగ్నీ కృతయుగమునందు కృతయుగ లక్షణ సంపన్నుడైన ధర్మరాజు అశ్వమేధ యాగం చేస్తాడు. మునులు, దేవతలు అభినందించు సమయంలో నీవు అచటికి పోయి ఆరాజు చేసిన దానధర్మములుగాని ఆయజ్ఞం గాని ఏ మాత్రం గొప్పది కాదని పలుకు" అప్పటితో నీకు శాపవిమోచనం కలుగుతుంది అని పితృదేవతలు చెప్పారు. అప్పటి నుండి ఆ జమదగ్ని మహర్షి ముంగిస రూపంతో సంచరించుచున్నాడు. నీ యాగాన్ని ఆక్షేపించిన క్షణంలోనే అతనికి తన నిజస్వరూపం వచ్చి ఆనందంగా వున్నాడు" అని చెప్పెను.

కనుక ఓ రాజా! దీనిని బట్టి తెలుసుకొనవలసిన విషయం ఏమనగా "హింసాత్మకమైన యజ్ఞయాగాదులకన్నా ధర్మనిష్ఠతో దానము చేసిన గొప్ప ఫలితం కలుగుతుంది అని ఆ మహాముని చెప్పెను.

---

## జనరల్ నాలెడ్జి

1 కళింగ బహుమతి దేనికి ఇస్తారు?

2 నానాజాతి సమితిని స్థాపించినది ఎవరు?

3 'సిటీ ఆఫ్ సెవెన్ హిల్స్' ఎక్కడ ఉన్నది?

4 లిబియా దేశం కరెన్సీ పేరు ఏమి?

5 ఆయిస్టర్ డావ్స్ ఏ పరిశ్రమకు ప్రసిద్ధి?

6 ముత్యములదీవి అని దేనికి పేరు?

7 ప్రపంచంలోని అతిదీర్ఘమైన గ్రంథం పేరు?

8 జ్యూస్ ఆరాధన సలిపే ప్రదేశాన్ని ఏమంటారు?

9 'షానామా'ను రచించిన దేవరు?

10 సాంచీలోని స్థూపాన్ని కట్టించినది ఎవరు?

జవాబులు: (1) శాస్త్రవిజ్ఞాన వృద్ధికి కృషి చేసిన వారికి, (2) ఉడ్రోవిల్సన్, (3) రోమ్, (4) దీనార్, (5) వజ్రాల పరిశ్రమకు, (6) బహురిను, పర్షియన్ గల్ఫ్ (7) మహాభారతం, (8) సినగాగ్, (9) ఫిరదౌసి, (10) అశోకుడు.

నిర్వహణ:

నేమని రామచందర్ రావు



ఇటీవల మద్రాసులో 'ఆనందో బ్రహ్మ' మిమిక్రీ క్యాసెట్‌ను విడుదల చేసిన పద్మశ్రీ అల్లురామలింగయ్య. మిమిక్రీ కళాకారుడు యం.ఆర్.ప్రసాద్, రచయిత శాండిల్యలను ఫోటోలో చూడవచ్చు.